సాక్షి
పల్నాడు

సోమవారం : 15 : జనవరి : 2024



వైభవంగా గోదా కల్యాణం

అమరావతి: అమరావతి పాండురంగస్వామి దేవాలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. దేవాలయంలో వేకువ జామున పంచామృత స్నపన జరిపారు.



శ్రీవారికి అలంకారం

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని రైల్వే స్టేషన్‌రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీవారికి వేంకటపాండురంగస్వామి అలంకారం చేసి పూజలు జరిపారు.



శ్రీగోదా రంగనాథుని కల్యాణం

గుంటూరు ఎడ్యుకేషన్ : నంగడిగుంటలో ఆదివారం శ్రీగోదాదేవి రంగనాథుని కల్యాణాన్ని వేద పండితులు తాతాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 50 మంది దంపతులు పాల్గొన్నారు.

అంగరంగ వైభోగి

- డీఎస్‌ఏ స్టేడియంలో కోలాహలంగా సంక్రాంతి సంబరాలు
- కుటుంబ సభ్యులతో హాజరైన కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వో
- ఆకట్టుకున్న గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు
- భోగి పండ్లు పోసి చిన్న పిల్లలకు దీవెనలు



భోగి మంటలు చుట్టూ నృత్యం చేస్తున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దంపతులు

నరసరావుపేట: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ క్రీడా ప్రాంగణంలో ఆదివారం ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, డీఆర్వో కె.వినాయకం దంపతులు, ట్రైనీ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ కుటుంబ సభ్యులు సంప్రదాయ దుస్తులతో హాజరై సందడి చేశారు. భోగి మంటలు వెలిగించి సంబరాల్ని ప్రారంభించారు. కలెక్టర్ అధికారులతో ఆటలు ఆడి, పాటలు అద్భుతంగా పాడారు. చెరుకు గడలు, హరిదాసుల పాటలు, గంగిరెద్దుల విన్యాసాలు, రంగవల్లులతో సందడి వాతావరణం నెలకొంది. కొత్త బియ్యం, పాలతో చక్కెరను కలిపి పొంగలి చేసి అందరికీ పంపిణీ చేశారు. పిల్లల తలపై భోగి పండ్లు పోసి దీవించారు. బొమ్మల కొలువులను అందంగా తీర్చిదిద్దారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ ప్రాశస్త్యం తెలిపే విధంగా ఉగాది ఉత్సవాలు, నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిర్భావం వంటి కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించి తిలకించారు. ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం, అజాదికా అమృత మహోత్సవ్, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఛాయా చిత్రాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా అధికారులు ఆంజనేయులు, ఓబులునాయుడు, కె.శామ్యూల్, మండల రెవెన్యూ అధికారి ఆర్.వి.రమణ నాయక్, మున్సిపల్ డీఈ ఓలేటి శ్రీనివాసరావు, నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, లింగంగుంట్ల మాజీ ఉప సర్పంచ్ పొన్నపాటి విజయకృష్ణారెడ్డి, మహిళలు, పిల్లలు పెద్దసంఖ్యలో పాల్గొని సందడి చేశారు.



భోగి పండ్లు పోస్తున్నకలెక్టర్ దంపతులు

హుషారు.. హుషారుగా...

సంబరాలలో ఎమ్మెల్యే గోపిరెడ్డి ఆటాపాట

నరసరావుపేట: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించి మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని, తనకు హ్యాట్రిక్ సాధించేందుకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రజల్ని కోరారు. భోగి పర్వదినం సందర్భంగా పల్నాడు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం, ఏపీ సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వేకువజామున పట్టణంలో పలుచోట్ల పట్టణ ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన భోగి మంటల వేడుకల్లో పాల్గొన్నారు. ప్రకాష్‌నగర్ రిక్షా సెంటర్ వద్ద గోపిరెడ్డి యూత్, గుంటూరు రోడ్డులోని కొండవీడు ఈయస్‌టీ హాస్పిటల్ ఎదురుగా రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భోగిమంటల వేడుకలో అందరితో కలిసి ఆటపాటలతో హుషారెత్తించారు. తానూ నృత్యం చేసి వేడుకలకు ఎమ్మెల్యే ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఎం.ఆర్. కల్పశ్రీ , డీఆర్వో కె.వినాయకం, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, గిరిజన సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, గృహసారథుల కన్వీనర్ మద్దిరెడ్డి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డీఎస్‌ఏ స్టేడియంలో డ్యాన్స్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, అధికారులు, నాయకులు

జగన్ పాలనలో పేదల జీవితాల్లో సం'క్రాంతి'



భోగి మంటలను వెలిగిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో భోగి మంటలు వేసి డ్యాన్స్ చేసిన మంత్రి

సత్తెనపల్లి: ప్రజలందరికీ సంక్రాంతి భోగభాగ్యాలు, సుఖసంతోషాలు కలగజేయాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుడిని కోరుతున్నానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లిలోని గాంధీ చౌక్ సెంటర్‌లో ఆదివారం ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి భోగి మంటల్ని వెలిగించి వేడుకల్ని ప్రారంభించారు. అనంతరం బంజారా మహిళలు, కళాకారులతో కలిసి స్టెప్పులు వేస్తూ డ్యాన్స్ చేసి ఉత్సాహ పరిచారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ తెలుగు వారు ప్రపంచంలో ఎక్కడున్నా సంక్రాంతికి కుటుంబ సభ్యులు, బంధువులతో గడిపేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తారని చెప్పారు. లక్షలాది మంది స్వగ్రామాలకు తరలి వస్తారని తెలిపారు. భోగి రోజు అన్నీ చెడు కర్మలు తొలగాలని కోరుతూ పాత వస్తువుల్ని మంటల్లో వేస్తారని పేర్కొన్నారు. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రతిబింబించే పెద్ద పండుగ సంక్రాంతి అన్నారు. భోగి కొండంత సంతోషంతో పాటు ఆరోగ్య, ఐశ్వర్యాలతో నిజమైన భోగాన్ని కలగజేయాలని ఆకాంక్షించారు. ఈ సంక్రాంతి పేదవాడికి నిజమైన సంక్రాంతిగా పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలనేది ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, దాని ముందు సంక్షోభం కూడా తలవంచిందని తెలిపారు. పేదవారి అభ్యున్నతే లక్ష్యంగా ఆయన పాలన సాగిస్తున్నారని చెప్పారు. సంక్రాంతి ప్రాశస్త్యాన్ని చాటి చెప్పేందుకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాలు నిర్వహించినట్లు వివరించారు. సంక్రాంతి పండుగ ఘనంగా జరుపుకునేందుకు, ప్రజలంతా సంతోషంగా గ్రామాలకు చేరుకునేందుకు అదనపు భారాన్ని తొలగిస్తూ వాస్తవ చార్జీనే వసూలు చేయాలని ఆర్టీసీని ప్రభుత్వం ఆదేశించిందని వెల్లడించారు. అంతేకాకుండా ఎన్ని బస్సులైనా వేయాలని సూచించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పార్టీ జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ గీతా హసంతి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కరరెడ్డి, ముప్పాళ్ల మండల అధ్యక్షుడు నక్కా శ్రీను, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, ధూళిపాళ్ల ఆంధ్రా బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివన్నారాయణ, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ పాల్గొన్నారు.

రూ.3471 కోట్లతో గురజాల నియోజకవర్గ అభివృద్ధి

- ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేయలేనిది ఎమ్మెల్యేగా చేసి చూపించా..
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల రూరల్: గురజాల నియోజకర్గంలో ఒక్క అవకాశం ఇచ్చారు.. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపించామని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కామేపల్లి శివారు బ్రాహ్మణపల్లి మెడికల్ కాలేజీలో ఆదివారం 'నాన్ రెసిడెన్షియల్ గురజాల' ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి మాట్లాడుతూ రూ. 3471 కోట్లతో గురజాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మార్పు కనపడితేనే వైఎస్సార్ సీపీని నమ్మాలని, గతం కంటే మెరుగ్గా ఉన్న గురజాల నియోజకవర్గాన్ని పరిశీలించాలని కోరారు. దాచేపల్లి, గురజాల గ్రామాల్ని మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దానని తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు చేయలేనిది, ఎమ్మెల్యేగా చేసి చూపించానని పేర్కొన్నారు. దాచేపల్లిలో కాటేరు వాగు ఆధునీకరణ చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేసినట్లు ఆరోపించారు. తాను బాధ్యతలు చేపట్టగానే ఆధునీకరించి, ఎంత వరద వచ్చినా నాగులేరు ద్వారా కృష్ణానదిలో కలిసేట్టు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. చంద్రబాబు చిల్లర రాజకీయాలు చేస్తూ, కుటుంబాలను కూడా చీలుస్తున్నట్లు విమర్శించారు. ఎన్ని పార్టీలతో బాబు కలిసి వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డి సింగిల్‌గానే యుద్ధంలోకి దిగుతారని, మళ్లీ సీఎం అవుతారని స్పష్టం చేశారు. పల్నాటి బ్రహ్మనాయుడు చాపకూడు సిద్ధాంతాన్ని తీసుకొని వచ్చి మాల కుటుంబానికి కన్నమ్మదాసును సైన్యాధిపతిగా నియమించాడని, అదే ఆదర్శంగా తీసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ కుటుంబాలకు చెందిన సుచరిత, వనిత లాంటి వారిని హోం మినిస్టర్లుగా గౌరవప్రదమైన పదవుల్లో కూర్చొబెట్టి, సమ న్యాయం చేశారని తెలిపారు.

క్లుప్తంగా

ప్రజలంతా శాంతి సౌభాగ్యాలతో జీవించాలి

సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పీఆర్కే



మాచర్ల: ప్రజలంతా సంక్రాంతి, కనుమ పండుగలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ రైతులకు, విద్యార్థులకు, అన్ని వర్గాలకు మేలు చేసే పండుగ అని చెప్పారు. ఈ పండుగను సుఖ సంతోషాలతో జరుపుకొని మరింత అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. పల్నాడు జిల్లాలో ప్రతి కుటుంబానికి ఆయన సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు: హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆదివారం సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సమేతంగా భోగి పండుగను జరుపుకున్న ప్రజలు సంక్రాంతి, కనుమ పండుగలను రెట్టించిన ఉత్సాహంతో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. పేద, బడుగు, బలహీనవర్గాల పెన్నిధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో తీసుకువచ్చిన గ్రామ స్వరాజ్యంతో పలెటూర్లు కళకళ లాడుతున్నాయని అన్నారు.

సంక్రాంతి జీవితాల్లో వెలుగులు నింపాలి

ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



నరసరావుపేట: పల్నాడు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలకు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగను సుహృద్భావ వాతావరణంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుతో కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల నడుమ జరుపుకోవాలన్నారు. ఈ సంక్రాంతి పండుగ అందరి జీవితాలలో నూతన కాంతులను, సంతోషాలను నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

నేడు స్పందన రద్దు

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

పూలు కోస్తుండగా విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మార్టూరు: భోగి పండుగ రోజు దేవుడికి పూజ చేయడం కోసం పూలు కోస్తున్న ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈవిషాదకర ఘటన ఆదివారం ఉదయం మార్టూరులో జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. వలపర్ల గ్రామానికి చెందిన వెచ్చా సుబ్బారాయుడు అలియాస్ చిన్నబుజ్జి (60) మార్టూరులో సొంతంగా గ్రానైట్ ఫ్యాక్టరీ నిర్వహిస్తూ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం భోగి పూజ నిమిత్తం ఇంటి పైన ఉన్న మొక్కల నుంచి పూలు కోసేందుకు డాబాపైకి వెళ్లాడు. పూలు కోసే క్రమంలో ఏసీ కనెక్షన్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు సుబ్బారాయుడికి తగలడంతో కాంక్రీట్ దిమ్మెను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త ఎంతకూ కిందకు దిగి రాకపోవడంతో డాబా పైకి వెళ్లిన భార్య పరిస్థితిని గమనించి కేకలు వేస్తూ ఇరుగు పొరుగు వారిని పిలిచింది. సుబ్బారాయుడును పరిశీలించిన స్థానికులు అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరు అమెరికాలో ఉన్నందున వారు వచ్చేంత వరకు మృతదేహాన్ని భద్రపరిచేందుకు చిలుకలూరిపేట మార్చురీకి తరలించారు.

గుర్తుకొస్తున్నాయి..!

35 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 1989 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 35 సంవత్సరాల తరువాత మళ్లీ కలుసుకున్నారు. ఆదివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా జరిగింది. దేశ, విదేశాల్లో స్థిరపడి ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వీరందరినీ ఒక తాటిమీదకు తీసుకురావడానికి కొంత మంది విద్యార్థులు నడుం బిగించారు. పాఠశాల ఆవరణలో కుటుంబ సభ్యులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. చిన్ననాటి ఊసులు నెమరవేసుకున్నారు. ఆడిన ఆటలు, పాడిన పాటలు, కోతి చేష్టలను నెమరవేసుకొని నవ్వుకున్నారు. కుటుంబ సభ్యులు, పిల్లలను పరిచయం చేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించుకున్నారు. ఆత్మీయ విందు ఏర్పాటు చేసుకొని అనుభూతులను నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో పాదిలి శ్రీనివాసరావు, రాయిని శ్రీను, దిరిసాల నాగశ్రీను, జానీసైదా, నాగమణి, ప్రవీణ్, పద్మజ, వెంగమాంబ, వెంకటరమణ మిత్ర బృందం పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

ఎమ్మెల్యే బొల్లా సమక్షంలో చేరికలు



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని కొప్పుకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని గణేషునిపాలెం గ్రామంలో టీడీపీకి చెందిన 100 కుటుంబాలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే బొల్లా పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఉన్న వారికి ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వీరంతా పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో నూజెండ్ల మండలంలోని టీడీపీ కంచుకోటగా ఉండే గురప్పనాయుడిపాలెం, టి.అన్నారంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని వందల మంది టీడీపీ కార్యకర్తలు పార్టీలోకి చేరడం శుభ పరిణామమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రజలను ఆకర్షిస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో నియోజక వర్గంలో పార్టీని బలోపేతం చేసి మరలా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు తమ కుటుంబ సభ్యులుగా భావించి అన్ని విధాలా ప్రాధాన్యతనిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, గ్రామ సర్పంచ్ కోలా వీరాంజనేయులు, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, సొసైటీ చైర్మన్ అనుమోలు నాసరరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి రెజ్లింగ్ జట్లు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఆదివారం పల్నాడు జిల్లా మహిళా, పురుషుల రెజ్లింగ్ (కుస్తీ) జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా పురుషుల జట్టుకు ఎస్.దయాకర్, పి.నాగరాజు, సీహెచ్.అబ్రహాం, కె.లాలూనాయక్, జి.వాసు, పి.చలపతి, కె.రామకృష్ణ, ఎస్.ప్రసాదరావు, ఎస్.బాబు, ఎస్.బాలకోటేశ్వరరావు, ఎం.పెదరాయుడు, ఏ.విజయకుమార్, మహిళా జట్టుకు ఎస్.విజయకుమారి, ఆర్.దేవమణి, జి.నిటీషా ఎంపికైనట్లు అసోసియేషన్ కార్యదర్శి జి.భూషణం తెలిపారు. ఎంపిక పోటీలను డీఎస్ఏ కోచ్ కె.మనోహర్, అసోసియేషన్ సభ్యులు ఆర్.జేమ్స్, పి.మహేష్ పర్యవేక్షించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20, 21తేదీలలో కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని భూషణం తెలిపారు. ఈ సందర్భంగా సౌత్ ఇండియా రెజ్లింగ్ పోటీలలో 87 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిన పి.నాగరాజును అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.



రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి



మృతుడు సాయిబాబా (ఫైల్)



ప్రమాద స్థలం వద్ద హోంగార్డు సాయిబాబా మృతదేహం

నకరికల్లు: వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో హోంగార్డు మృతి చెందాడు. ఈ ఘటన స్థానిక అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన షేక్.సాయిబాబా (45) నరసరావుపేటలో ట్రాఫిక్ విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం విధులకు హాజరయ్యేందుకు తన ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు బయలుదేరాడు. మార్గ మధ్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ క్రమంలో వెనుకనుంచి వస్తున్న లారీ సాయిబాబాను ఢీ కొట్టింది. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వల్లెపు కోటేశ్వరరావు తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రజలకు ఎంపీ లావు సంక్రాంతి శుభాకాంక్షలు

నరసరావుపేట: నియోజకవర్గ ప్రజలకు పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు ఆదివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ ప్రతి ఇంటిలో పాడి పంటలు, సిరులతో పాటు ఆనందాలు నింపాలని కోరారు. ప్రతి ఒక్కరూ చేపట్టే పనిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

క్వారీ నీటిగుంటలో పడి గొర్రెల కాపరి మృతి



మృతుడు వీరాంజనేయులు

అమరావతి: టీడీపీ పాలనలో డ్రెడ్జర్లతో ఇసుక తీయటం కారణంగా ఏర్పడిన గుంటలలో పడి ఇప్పటివరకు సుమారు 23 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా తాడి ఎత్తు కుంటల కారణంగా శనివారం గొర్రెలు కాచుకునే ఓ యువకుడు బలయ్యాడు. మాచర్ల మండలం కొత్తూరు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి జానపాటి వీరాంజనేయులు(35) తన గొర్రెల మందతో గొర్రెలు మేపటానికి కొండ ప్రాంతానికి చేరుకున్నాడు. రోజు లాగానే శనివారం గొర్రెలు మేపుకుంటూ కుంటలో గొర్రెలకు నీరు తాగిద్దామనే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు కాలుజారి కుంటనీటిలో పడి మునిగి చనిపోయాడు. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ బ్రహ్మం తెలిపారు. ఆదివారం కుంటలో పడి మృతి చెందిన వీరాంజనేయులు మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో కంటైనర్ డ్రైవరు మృతి

మృతుడు ఉత్తరప్రదేశ్ వాసిగా గుర్తింపు



క్యాబిన్‌లో చిక్కుకొని మృతి చెందిన డ్రైవర్ పునీత్ కుమార్

రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు గ్రామ సమీపంలో అద్దంకి–నార్కెట్‌పల్లి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చెన్నై నుంచి హైదరాబాద్‌కు పాత ఇనుము లోడుతో వెళ్తున్న లారీ, హైదరాబాద్ నుంచి చెన్నైకు వెళ్తున్న కంటైనరు అన్నవరప్పాడు సమీపంలోకి రాగానే ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కంటైనర్ డ్రైవర్ పునీత్ కుమార్(24) మృతి చెందాడు. ప్రమాదంలో రెండు వాహనాలు ఢీకొనడంతో కంటైనర్ డ్రైవర్ క్యాబిన్‌లోనే చిక్కుకొని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కేపీ.రవీంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతి చెందిన పునీత్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

బావిలో పడి ఆర్టీసీ మెకానిక్ మృతి



మృతి చెందిన కంభంపాటి వెంకటరావు

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెంది 18 రోజులు గడవకముందే కుమారుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందటంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అంబేడ్కర్ కాలనీకి చెందిన కంభంపాటి కోటేశ్వరరావు గత నెల 27వ తేదీన మార్కెట్ యార్డులో కూరగాయలు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా, కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో విషాదం అలుముకున్న ఇంటిలోనే మరో విషాదం చోటు చేసుకుంది. ఈయన పెద్ద కుమారుడైన కంభంపాటి వెంకటరావు (45) చిలకలూరిపేట ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పని చేస్తూ సోదరుడు రాంబాబుతో కలిసి గ్రామంలో కొంత పొలాన్ని సాగు చేస్తున్నాడు. ఆదివారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు ఇరువురూ వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో భోజనం తెచ్చేందుకు రాంబాబు ఇంటికి వెళ్ళాడు. ఈ సమయంలో వెంకటరావు ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. భోజనం తీసుకుని పొలానికి వచ్చిన రాంబాబు తన సోదరుడి కోసం వెతకగా బావిలో శవమై కనిపించాడు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తుంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వాస్తవాలను ప్రతిబింబించేవే నాటికలు

కొనసాగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలు



నాటిక పోటీలను ప్రారంభిస్తున్న తేళ్ల అరుణ, కందిమళ్ల జయమ్మ, ఇందిర, చంద్రకళ



రైతుభారతం నాటికలోని సన్నివేశం

యద్దనపూడి: సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపించేవే నాటికలని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అన్నారు. ఆదివారం మండలంలోని అనంతవరం గ్రామంలో నాలుగో రోజు ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ద్వితీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల్లో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే కందిమళ్ల జయమ్మ, చిలకలూరిపేట ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు మారెళ్ల ఇందిర, కథ, నవల రచయిత్రి చంద్రలత పాల్గొన్నారు. తేళ్ల అరుణ మాట్లాడుతూ సమాజంపై ప్రభావం చూపించటంలో నాటికల పాత్ర కీలకమన్నారు. భాష ఉన్నతికి చిరునామాగా, సామాజిక హితాన్ని కాంక్షిస్తూ ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని వాస్తవ పరిస్థితులను పంచే నాటికలకు పూర్వవైభవం రావాలని ఆకాంక్షించారు. నవలా రచయిత్రి చంద్రకళ మాట్లాడుతూ కళాపరిషత్‌లే కాక ప్రభుత్వాలు, ప్రైవేట్ టీవీ చానళ్లు, ఆధ్యాత్మిక సంస్థలు కూడా నాటికలకు ప్రోత్సాహం అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ భారతీయ సమాజాన్ని పట్టిపీడిస్తున్న వివక్షను నాటకం, నాటికలు ఎండగట్టాయని, సామాజిక వివక్షలకు వ్యతిరేకంగా నాటిక ప్రదర్శనలు ఓ ఉద్యమమే చేసిందన్నారు. అలాంటి కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు, మద్దినేని జయరామకృష్ణ, గుదే తారక రామారావు, పోపూరి హనుమంతురావు, కొరిటాల వంశీకృష్ణ, శివసుబ్బారావు, పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన నాటికలు..

నాలుగో రోజు తొలినాటికగా న్యూస్టార్ మోడరన్ థియేటర్స్ ఆర్ట్స్ విజయవాడ వారి 'కపిరాజు', రసఝరి పొన్నూరు వారి 'కాపల', శ్రీకారం రోటరీ కళాపరిషత్ 'రైతు భారతం' నాటికలు దేనికదే తమ ప్రత్యేకతను చాటుకున్నాయి. కళాకారుల ప్రదర్శనలతో వీక్షకులను రంజింపజేశారు.

సెమీస్‌కు చేరిన చెన్నై జట్లు

హోరాహోరీగా జాతీయస్థాయి క్రికెట్ పోటీలు



థండర్‌బోల్ట్స్ తిరుపతి- చెన్నై మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్‌ను రన్ అవుట్ చేస్తున్న కీపర్

మేదరమెట్ల: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావినూతల క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్న భ్రమర సంక్రాంతి కప్–2024 పోటీల్లో భాగంగా ఆదివారం జరిగిన రెండు మ్యాచ్‌లలో చెన్నై జట్లు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరాయి. ఉదయం శ్రీసీసీ (చెన్నై) –థండర్‌బోల్ట్ (తిరుపతి) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన తిరుపతి జట్టు ప్రత్యర్థి జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బ్యాటింగ్ ఆరంభించిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. జట్టులో మురుగేష్ 34 నాటౌట్, వసీం 25 పరుగులు చేశారు. తిరుపతి బౌలర్లలో ప్రకాష్, నవీద్ చెరీ రెండు వికెట్లు తీశారు. అనంతరం 124 పరుగులు విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన తిరుపతి జట్టు పేలవ ఆట తీరుతో 11.3 ఓవర్లలో 44 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. చెన్నై బౌలర్లలో టి.తరుణ్ 2.3 ఓవర్లలో 7 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీసి తిరుపతి జట్టు వెన్నువిరిచాడు. దీంతో 79 పరుగుల భారీ తేడాతో శ్రీ సీసీ చెన్నై జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది.

– మధ్యాహ్నం ప్రసాద్ జీ స్పోర్ట్స్ లెవెన్ (హైదరాబాద్)– జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై) జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన హైదరాబాద్ బ్యాటింగ్ ఎంచుకొని 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. జట్టులో అభి 56 పరుగులు చేశాడు. చెన్నై జట్టు బౌలర్ చంద్రశేఖర్ 2 వికెట్లు తీశాడు. అనంతరం 142 పరుగుల విజయం లక్ష్యం కోసం బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 16.2 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా విజయం సాధించింది. దీంతో జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై) జట్టు ఆరు వికెట్ల తేడాతో గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకుంది. జట్టులో కవిన్ 44 పరుగులు, సుధాన్ 32 పరుగులు చేసి జట్టు విజయానికి దోహదపడ్డారు.

నేడు సెమీ ఫైనల్స్‌లో తలపడే జట్లు..

ఉదయం మొదటి సెమీఫైనల్ చిక్కోల్ చీతాస్ (శ్రీకాకుళం)–శ్రీసీసీ (చెన్నై) జట్ల మధ్య జరుగుతుంది. మధ్యాహ్నం రెండో సెమీఫైనల్ జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై)–సౌత్ సెంట్రల్ సీసీ (చెన్నై) జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నట్లు అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు తెలిపారు.

కారంచేడులో ప్రముఖుల సందడి



కారంచేడు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కారంచేడులో గ్రామానికి చెందిన సినీ, రాజకీయ ప్రముఖులు కుటుంబ సభ్యులతో సందడి చేశారు. శనివారం రాత్రికే గ్రామానికి చేరుకున్న మూవీ మొఘల్, సినీ నిర్మాత డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు కుమారుడు, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు, ఆయన సతీమణి లక్ష్మి, హీరో దగ్గుబాటి వెంకటేష్, భార్య నీరజ, హీరో రానా, ఆయన సతీమణి మిహికా బజాజ్, సినీ హీరో అభిరామ్, ఆయన భార్య ప్రత్యూష, సురేష్‌బాబు కుమార్తె మాళవిక, రామానాయుడు సతీమణి రాజేశ్వరిలు గ్రామంలోని ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి ఆరాధ్యదైవం అయిన కట్టమల్లేశ్వర స్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.